క్లుప్తంగా

ఊరెళితే పోలీసులకు సమాచారమివ్వండి

అమరావతి: పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని ప్రజలు ఎవరైనా ఇంటికి తాళాలు వేసి వేసవి సెలవులకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇస్తే దొంగతనాలు నివారించవచ్చునని సీఐ. వై.అచ్చయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలంలో సాధారణంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లలో అధికంగా దొంగతనాలు జరుగుతున్నందున తప్పక పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. వేసవి సెలవులకు దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు ఇళ్లలో ఎలాంటి విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు మీ గ్రామంలో మహిళా పోలీసులకు గానీ, పోలీస్ స్టేషన్‌లో గానీ సమాచారమిస్తే మీ ఇంటిపై లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా నిఘా పెట్టి ఎలాంటి దొంగతనాలు జరగకుండా నివారిస్తామని తెలిపారు. ఈ విషయమై ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

క్రోసూరు పీహెచ్‌సీ వైద్యుడిగా రాంబాబునాయక్

ఒక వైద్యుడు బదిలీ,
మరొక వైద్యుడు హజ్‌యాత్ర

క్రోసూరు: క్రోసూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యుడిగా డాక్టర్ వి.రాంబాబునాయక్ నియమితులైనట్లు తెలిసింది. పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులు పనిచేస్తుండగా డాక్టర్ ధనుష్ బదిలీపై వెళ్లారు. మరొక వైద్యుడు డాక్టర్ సాధ్ హజ్‌యాత్ర సెలవులో ఉన్నారు. ప్రస్తుతం డాక్టర్ సిరిచందన ఒక్కరే పనిచేస్తున్నారు. దీంతో జిల్లా వైద్య అధికారి డాక్టర్ రవి అచ్చంపేట మండలం మాదిపాడు పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ వి.రాంబాబునాయక్‌కు క్రోసూరు పీహెచ్‌సీ బాధ్యతలు అప్పగించినట్లు సీనియర్ అసిస్టెంట్ బాషా తెలిపారు. రాంబాబునాయక్ సోమవారం విధుల్లో చేరవచ్చునని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

సత్తెనపల్లి: కిట్స్ సంస్థ (ఎన్జీవో) విజయవాడ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా పేషంట్ రిలేషన్‌షిప్ అసోసియేట్ (పీఆర్ఏ) కోర్సులో రెండు నెలల పాటు ఉచితంగా వసతి, భోజనం సౌకర్యం కల్పించి ఉచిత నైపుణ్య శిక్షణ అందించి, అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ కోర్సుతో పాటు ప్రతి విద్యార్థికి స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్స్, లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. కోర్సు వ్యవధి రెండు నెలలని, వయసు 19 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలని, విద్యార్హత ఇంటర్మీడియట్ పాస్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబర్‌లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగులు ఈ శిక్షణను వినియోగించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆయన కోరారు. బ్యాచ్ ఈ నెల 8న ప్రారంభమవుతుందన్నారు.

వైభవంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల

గోలి(రెంటచింతల): స్థానిక నాగేంద్రస్వామి దేవస్థానంలో వెలసిన నీలంపాటి అమ్మవారి ఆలయ తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామరాజు కేశవరావు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి పొంగళ్లను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు 5 గ్రామాల పెద్దల సహకారంతో ఆలయ ధర్మకర్త బత్తినేటి బాల కోటేశ్వరరావు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట



దాచేపల్లి: స్థానిక మాదినపాడు రోడ్డులో పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి, జయదుర్గాదేవి విగ్రహాలు, ఆలయ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మర్షి పాణకుపాటి వెంకటలక్ష్మీ నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి, జయ దుర్గాదేవి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, నాగేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీతను అనుసరించాలి

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట, గుండ్లపాడులో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరి పేట కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని అధ్యక్షుడు కటకం సైదారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులకు 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. యద్దనపూడి వీరాంజనేయులు, అరుణ, కార్తీక, నారాయణమ్మ, అనూరాధ వెంకట లక్ష్మి, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులను కాపాడండి ఇలా...!

- పశువులకు వడదెబ్బ ముప్పు
- వేసవి తాపానికి అనారోగ్యంపాలు
- పశు సంరక్షణలో తగు జాగ్రత్తలు అవసరం
- పాడి రైతులకు పశు వైద్యుల సూచనలు



ప్రాంతీయ పశువైద్యశాల, రాజుపాలెం



వేసవి తాపానికి చెట్ల కిందే పశువులు

రాజుపాలెం: వేసవి కాలం ప్రభావం పశువులపై అధికంగా ఉంటుంది. వేసవిలో పశు పోషణ, సంరక్షణలోను జాగ్రత్తలు పాటించాలని పశు వైద్య నిపుణులు పశు పోషకులకు సూచిస్తున్నారు. పశు పోషకులు ఎక్కువగా గేదెల పెంపకంపై మక్కువ చూపుతారు. వాటి పాలు చిక్కగా ఉండి, పెరుగు రుచిగా ఉంటుంది. ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలో గల బెల్లంకొండ, రాజుపాలెం మండలాల్లో పశు సంపదను పరిశీలించగా గేదెలు మాత్రమే అధికంగా ఉన్నాయి. తరువాతి స్థానాల్లో గొర్రెలు, మేకలు, వాణిజ్య కోళ్లు ఉన్నాయి. గడచిన శీతాకాలంలో పశువులు ఎదకు వచ్చి గర్భం ధరించి ఉంటాయి. కొన్ని పశువులు పాడి దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పశు పోషకులు అప్రమత్తంగా ఉండి కొన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తే పశువులను వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చు. సాధారణంగా పశువులలో 101 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రత వరకు శరీరం ఏవిధమైన మార్పులకు లోనుకాదు. 103 డిగ్రీల ఫారన్ హీట్ దాటినప్పుడు పశువులు అశ్వస్థతకు గురి అవుతాయి. ముఖ్యంగా గేదెలలో వాటి శరీర (నలుపు) రంగు కారణంగా చెమట గ్రంధులు తక్కువ సంఖ్యలో ఉండటం, అవి కూడా శరీరానికి బాగా లోపల భాగంలో ఉండడం వలన అధిక ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేవు.



పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టె

నీటి తొట్టెలు

ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామ శివారులో నీటి తొట్టెల నిర్మాణం చేపడుతుంది. గ్రామ పంచాయతీ వారు వాటిని నీటితో నింపుతారు. పశు పోషకులు నీటి తొట్టెలను వినియోగించుకుని పశువులను వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చు.

నివారణ చర్యలు

- పశువుల పాక చుట్టూ చెట్లు ఉండే విధంగా చూసుకోవాలి.
- పాక చుట్టూ గోనె సంచులు కట్టి అప్పుడప్పుడు నీటితో తడుపుతూ ఉండాలి.
- పశువుల షెడ్‌లో గాలి ప్రసరణ సరిగా ఉండే విధంగా చూసుకోవాలి. పరిస్థితులను బట్టి ఫ్యాన్లు కూడా అమర్చాలి.
- పశువులపై మధ్యాహ్నం సమయంలో చల్లని నీరు చల్లుతూ ఉండాలి.
- పచ్చి గడ్డిని సమృద్ధిగా సమకూర్చాలి.
- తాగు నీరు అందుబాటులో ఉండే విధంగా చూడాలి.
- పశువులను మేత కొరకు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తరువాత తీసుకెళ్లాలి.
- దాణాలో సోడియం, పొటాషియం లవణాలు, కొవ్వుపదార్థాలు సమపాళ్లలో ఉండే విధంగా చూసుకోవాలి.
- చూడు పశువులకు ప్రోజిస్టిరిన్ ఇంజక్షన్లు నెలలో రెండుసార్లు చొప్పున వేసవి కాలం పూర్తయ్యే వరకు ఇవ్వడం వలన గర్భస్రావం అరికట్టవచ్చు.

వడదెబ్బ.. పరిణామాలు

- శరీర ఉష్ణోగ్రత 106 ఫారన్‌హీట్ నుంచి 108 ఫారన్‌హీట్ నమోదైనప్పుడు మరణాలు సంభవించవచ్చును.
- ఆకలి మందగించడం, పాల ఉత్పత్తి తగ్గడం వంటివి జరుగుతాయి.
- చూడు పశువులలో గర్భస్రావం జరిగే అవకాశం ఉంటుంది. ఫలితంగా రుతుచక్రం మందగించి ఎదకు రావడం ఆలస్యమవుతుంది.

వడదెబ్బ లక్షణాలు

- పశువుల శరీర ఉష్ణోగ్రత 101 ఫారన్ హీట్ నుంచి 107 ఫారన్ హీట్ వరకు పెరుగుతుంది. కొన్ని సార్లు 110 వరకు కూడా ఉంటుంది.
- నోటి నుంచి విపరీతంగా చొంగ కారుతుంటుంది.. చికాకుగా ఉంటాయి.
- నీరసంగా ఉండి తూలుతూ నడుస్తుంటాయి. నడవలేక పడిపోతుంటాయి.
- శ్వాసక్రియ రేటు ఎక్కువగా ఉంటుంది.
- పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లడం, శరీరం బాగా చల్లబడిపోవటం జరుగుతుంది.
- పశువులు చల్లని ప్రదేశాల కోసం వెతుకులాడుతుంటాయి.

సొంత వైద్యం చేయరాదు



పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న రైతులు వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగి వడ దెబ్బ తగిలినప్పుడు ప్రాథమికంగా పశువులను చల్లని ప్రదేశంలో ఉంచి శరీరంపై గోనె సంచిని కప్పి చల్లని నీరును తరచుగా చల్లడం వలన శరీర ఉష్ణోగ్రతను తగ్గించవచ్చు. సొంత వైద్యం చేయరాదు. వెంటనే సమీపంలోని పశు వైద్యుని సంప్రదించాలి.

– డాక్టర్ జీ వీరయ్య, అసిస్టెంట్ డైరెక్టర్, పశు వైద్యశాల, రాజుపాలెం

భక్తిశ్రద్ధలతో లింగమయ్య స్వామి తిరునాళ్ల

ముప్పాళ్ల: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న లింగమయ్య స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే శ్రీ నిదానంపాటి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి హాజరై లింగమయ్య స్వామిని, శ్రీనిదానంపాటి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, ఎంపీపీ మారూరి పద్మావతి రామలింగారెడ్డి, సర్పంచ్ గాయత్రి లక్ష్మణ్, రెండెద్దుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మధిర వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ మధిర రామకృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గొలమారి వెంకట్రామిరెడ్డి, రామలింగారెడ్డి, రమేష్ బాబు, కిక్కురు రామిరెడ్డి, బాషా, సుభాని, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్, రోళ్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో డాక్టర్ గజ్జల

ఘనంగా గంగమ్మ తల్లి తిరునాళ్ల



అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న దంపతులు

పిడుగురాళ్ల: గంగమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు వేద పండితులు వివిధ అభిషేకాలు నిర్వహించి అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కి విశేష పుష్పాలంకరణ గావించారు. అంతేకాకుండా ఉదయం ఉంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల నడుమ గంగా సమేత ఉమామహేశ్వర స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 12.30 గంటలకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయంలో ఉమా మహేశ్వరుల ఉత్సవ మూర్తులను కనక తప్పట్లతో, విద్యుత్ దీపాలంకరణ పూలబుట్టలతో మహిళలతో ఊరేగింపు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

క్రోసూరులో ఓ మోస్తరు వర్షం

క్రోసూరు: క్రోసూరు మండలంలో ఉదయం 5 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతవరణం చల్లబడిపోయి చల్లటి గాలులు వీయటంతో ప్రజలు వేసవి తాపం నుంచి ఆదివారం సేదతీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తిగా చల్లటి వాతవరణం నెలకొంది. గత రెండు మాసాలుగా ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రతకు ప్రజలు విలవిలలాడారు. ఆదివారం ఉదయం వాతవరణం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి చల్లబడటమేకాక కొద్దిపాటి వర్షం కురవటంతో ప్రజలు, పశుపక్షాదులు చల్లటి వాతవరణంలో సేద తీరారు.

క్రోసూరు ఎస్ఐగా రవిబాబు

క్రోసూరు: క్రోసూరు ఎస్ఐగా రవిబాబు నియమితులైనట్లు తెలిసింది. మాచర్ల రూరల్ నుంచి ఇక్కడకు బదిలీ అయినట్లు తెలిసింది. సోమవారం విధుల్లో చేరనున్నట్లు సమాచారం. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ నాగేంద్రరావు గత నెలలో వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో రవిబాబు నియమితులైనట్లు తెలిసింది.

లారీ ట్రాక్టర్ ఢీ.. ఇద్దరికి గాయాలు

పిడుగురాళ్ల: లారీ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన పట్టణ సమీపంలోని కొండమోడు సమీపంలోని వీకేఎఫ్ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాలు... సూరత్ నుంచి చీరల లోడుతో లారీ వస్తుండగా లారీ ఎదురు ట్రాక్టర్ ట్రక్కును తప్పించబోయి అదే ట్రాక్టర్‌ను ఢీకొనటంతో లారీ, ట్రాక్టర్ అదుపు తప్పి రెండు పడ్డాయి. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్స అనంతరం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలతో తరలించారు. లారీ డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనలో లారీ, ట్రాక్టర్. దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్య, వైద్యానికి రోటరీ ప్రాధాన్యం

- డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి
- డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు

మాచర్ల: రోటరీ క్లబ్ పరిధిలో వైద్య, విద్య, ఉపాధి పథకాలకు రోటరీ జిల్లా పరిధిలోని రూ.15 కోట్లతో వివిధ చేయూత కార్యక్రమాలను చేపడుతున్నట్లు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్ చౌదరి అన్నారు. ఆదివారం వైభవ్ రెసిడెన్సీలో విలేకరులతో మాట్లాడారు. రోటరీ క్లబ్ విస్తృత సేవా కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే మాచర్ల ప్రాంతంలో 16 మందికి కుట్టు మిషన్లు అందజేయటం జరిగిందన్నారు. వృత్తి పరంగా నైపుణ్యం కలిగిన వారికి ప్రత్యేక పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. మాచర్ల రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలలో ముందన్నారు. మహిళా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పూర్తి స్థాయిలో బాధ్యత వహించి క్లబ్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రత్యేకంగా ఐదు డయాలసిస్ సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. మాచర్లలోనూ స్థలం కేటాయిస్తే డయాలసిస్ సెంటర్ పెట్టడానికి సిద్ధమని వెల్లడించారు. మాచర్ల రోటరీ క్లబ్ చరిత్రలోనే అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ కె.రామకోటయ్య ద్వారా పల్స్ పోలియో ఎంతో ప్రశంసనీయంగా నిర్వహించటం జరిగిందన్నారు. రోటరీ క్లబ్ ద్వారా 10 వేల మందికి డయాగ్నస్టిక్ సేవలందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ రామకోటయ్య, క్లబ్ అధ్యక్షురాలు కృష్ణకుమారి, ప్రధాన కార్యదర్శి సురేఖ, కోశాధికారి లక్ష్మి, అసిస్టెంట్ గవర్నర్ ఎం.సమధ్ కుమార్, పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి

వైభవంగా పోలేరమ్మ, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

పిడుగురాళ్ల రూరల్: పోలేరమ్మ, మారెమ్మ, పోతురాజు, సంతాన నాగేంద్రస్వామి, పంచముఖ నాగేంద్రస్వామి విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలోని పోలేరమ్మ తల్లిదేవాలయంలో ఆదివారం ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తెల్లవారుజామున గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ హోమం నిర్వహించారు. అనంతరం వేదమంత్రలతో, కనకతప్పట్ల మోతలతో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నేడు, రేపు పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శన

అమరావతి: ప్రజా చైతన్యం కోసం సంప్రదాయ కళను ప్రోత్సహించి కళాకారులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ప్రజానాట్య మండలి సభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి పెదకూరపాడు నియోజకవర్గ ప్రజానాట్య మండలి కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బస్టాండు సెంటర్‌లో 5, 6 తేదీలలో రెండు రోజులపాటు సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ రంగస్థల నటులు కీర్తిశేషులు పాదిలి మల్లేశ్వరరావు నాటక కళావేదికపై ఉచిత పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఐదో తేదీ సోమవారం రాత్రి ఏడు గంటలకు దేవనర్తకి సాంఘిక నాటకం, ఆరో తేదీ మంగళవారం రాత్రి ఏడు గంటలకు రామాంజనేయ యుద్ధం వార్ సీను, సత్య హరిశ్చంద్ర పూర్తి నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాస్తి సత్యమూర్తి, సీహెచ్ ఉదయశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, గుంటూరు రాజు, బత్తిన రామయ్య, ఎస్.శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ

ఘనంగా అభయాంజనేయస్వామి తిరునాళ్ల



విద్యుద్దీపాల అలంకరణలో అభయాంజనేయస్వామి ఆలయం

నకరికల్లు: మండలంలోని అడ్డరోడ్డు గ్రామంలో వేంచేసి ఉన్న అభయాంజనేయస్వామి 24వ వార్షిక వేడుకలు, తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు వినుకొండ కొండమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వార్షిక వేడుకలు పురస్కరించుకొని స్వామి వారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. పంచామృత స్నపన గావించి, ప్రత్యేకంగా అలంకరించారు. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి, చీరాల వాడరేవు రహదారి కూడలిలో ఉన్న ఆలయం కావడంతో దూరప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విశేష అలంకరణలో ఉన్న స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. గ్రామంలోని భక్తులు తిరునాళ్ల పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



అభయాంజనేయస్వామి

అబ్దుల్ ఖాదర్‌ను పరామర్శించిన డాక్టర్ గజ్జల

నరసరావుపేట: మండలంలోని యలమంద గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ ఖాదర్‌ను సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి ఆదివారం పరామర్శించి అతని కాలి గాయాన్ని పరిశీలించి తగిన వైద్యం అందజేస్తామని హామీ ఇచ్చి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. అబ్దుల్ ఖాదర్ ఇటీవల యాక్సిడెంట్‌కు గురై కాలుకు దెబ్బ తగిలి వైద్యానికి దూరంగా స్థానిక కేఎస్‌పీ కాలనీలోని స్వగృహంలో ఉంటున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన పల్నాడు జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు సయ్యద్ గోరా, అతని మిత్రులు కలిసి డాక్టర్ గజ్జల సుధీర్‌కు విషయం తెలియచేశారు. దీంతో ఆయన స్పందించి ఖాదర్ నివాసానికి వెళ్లి అతడి ఆరోగ్య విషయాలు తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి గాయమైన కాలుకు వైద్య సేవలు అందజేస్తామని హామీ ఇచ్చారు.



ఖాదర్‌ను పరామర్శిస్తున్న డాక్టర్ సుధీర్‌భార్గవ రెడ్డి

ఫిల్టర్ బెడ్ ట్యాంకులో కోతుల స్నానాలు..!

దొడ్లేరు(క్రోసూరు): వేసవి తాపానికి పశువులు, జంతువులు, పక్షులు నీటి కుంటల వద్దకు చేరి నీటిలో మునగటం, నీళ్లు తాగటం చేస్తుంటాయి. అదే విధంగా కోతులు మండలంలోని దొడ్లేరు గ్రామంలో నీటి సరఫరా చేసే ఫిల్టర్ బెడ్ ట్యాంకులో స్నానాలు చేస్తున్నాయి. ఫిల్టర్ బెడ్‌ద్వారా ట్యాంకుకు నీళ్లు ఎక్కించి గ్రామంలో పంచాయతీ నీటిని సరఫరా చేస్తుంటుంది. అదే ట్యాంకులో కోతులు స్నానాలు చేస్తుండటంతో గ్రామంలో కొందరు వీడియో తీయటం జరిగింది. ఎండలు తీవ్రంగా ఉండటంతో మూగజీవాలు నీటి వద్దకు చేరుకొని ప్రాణాలు దక్కించుకుంటున్నాయి. అయితే పంచాయతీ సరఫరా చేసే నీళ్లు కావటంతో తాగునీటి పరిస్థితి ఏమిటని ప్రజల్లో సందేహం నెలకొంది.



స్నానమాచరించి గోడ ఎక్కిన కోతులు

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

మాచర్ల: వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో విద్యార్థులు రాణించి ఉత్తమ ఫలితాలు సాధించటం ఎంతో అభినందనీయమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్ చౌదరి అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను వైభవ్ రెసిడెన్సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులను సత్కరించి మెమెంటోలు అందించారు. అదే విధంగా కార్యక్రమంలో భాగంగా 14 మంది గర్భిణులకు స్త్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల ప్రాంతంలో క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, కోశాధికారి లక్ష్మి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు జరగటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకోటయ్య, అసిస్టెంట్ గవర్నర్ ఎం.సమద్ కుమార్, డాక్టర్ కేపీ చారి, రోటరీ క్లబ్ సభ్యులు పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం శర్మ పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం